ఆరు గ్యారంటీలను అమలు చేయాలి


ప్రచారం చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

లింగోజిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఐఎంఎల్ నాయకులు విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఈ నెల 20న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఎల్‌బీ నగర్‌లోని పలు లేబర్ అడ్డాల వద్ద ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో పరశురాం, యాదయ్య, రియాజ్, మహేష్, సుభాష్, గోపి, సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

మలక్‌పేట ఆస్పత్రిలో రిక్రియేషన్ రూమ్ ప్రారంభం

మలక్‌పేట: ఆనంద ఫౌండేషన్ ఫర్ హెల్త్ ఆధ్వర్యంలో మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన యాక్టివిటీ అండ్ రిక్రియేషన్ రూమ్‌ను మంగళవారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ మొగిలి సురేష్ మాట్లాడుతూ.. చంటి పిల్లలతో వైద్యం కోసం వచ్చి వారికి పిల్లలు ఆడుకోవడానికి గది ఏర్పాటు చేశారు. అందులో బొమ్మలు, బ్లాక్‌బోర్డు, పుస్తకాల పెట్టడం జరిగిందని అక్కడ ఆయా ఉండి వారిని చూసుకుంటుందన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరం చేయడానికి యాక్టివిటీ అండ్ రిక్రియేషన్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌బాగ్


రిక్రియేషన్ రూమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, మాజీ కార్పొరేటర్ ముర్తుజా, అడ్మిన్ ఆఫీసర్ అంజనేయులు, ఫౌండేషన్ నిర్వాహకులు సీత, పాల్గొన్నారు.

మూసారంబాగ్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి


దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసారంబాగ్‌లో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ దూరదృష్టి గల ఆలోచనలు అంత్యోదయ ప్రగతి కోసం బాటలు వేశాయన్నారు. ఆయన చూపించిన సేవ అందరికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సురేందర్, ప్రవీణ్, గణేష్, అజయ్, ప్రవీణ్, పరశురామ్, సంతోష్, మల్లేష్ పాల్గొన్నారు.

గడ్డిఅన్నారం డివిజన్‌ను అగ్రగామిగా నిలుపుతా


మాట్లాడుతున్న బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపుతానని కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్‌గా నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా వీవీనగర్‌లో కాలనీల సంక్షేమ సంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.18 లక్షలతో సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు ఔట్‌లెట్‌లోకి రాకుండా జాలీ ఏర్పాటు చేసి లోతట్టు కాలనీలకు ముంపు సమస్య రాకుండా చేశామన్నారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం కింద రెండు వేల మందికి హెల్త్ కార్డులు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో దాసరిప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి, నిర్మల, ఆనంద్‌కుమార్, లక్ష్మిప్రసాద్, ఓంకార్ వెంకటేష్‌చారి, లక్ష్మి, జయ, నగేష్ పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధికి చేస్తాం

వనస్థలిపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సమీపంలోని హెచ్‌ఎండీఏ పార్క్‌లో రూ. 60 లక్షలతో టాయిలెట్లు, సీసీ కెమెరాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హెచ్‌ఎండీఏ అధికారి రంజిత్, సంబంధిత కాంట్రాక్టర్, పార్క్ యూజర్స్ అసోసియేషన్ నాయకులతో కలిసి పార్క్ అభివృద్ధిపై సమీక్షించారు. అలాగే డివిజన్ పరిధిలోని అభ్యుదయనగర్ పార్క్‌ను కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్క్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి,


స్థానికులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మధుసూదన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, ముత్తిలింగం, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సాయికిరణ్‌గౌడ్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరంలో మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగారం గ్రామంలో మంచె పాండుయాదవ్ ఫాంహౌస్‌లో బీఆర్‌ఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపు కోసం నిరంతరం కృషి చేసి గెలిపిస్తానని తెలిపారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్ల వారీగా అభ్యర్థులను సిద్ధం చేసుకొని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఏ రిజర్వేషన్ వచ్చినా పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఆశావాహులు ఎన్నికల్లో పోటీచేసే ఆసక్తి కలిగిన వారు



అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి తెలియజేసి చైతన్యవంతం చేయాలని సూచించారు. అమలుకు నోచుకోని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. గత బీఆర్‌ఎస్ ఎస్సీ, ఎస్సీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిందన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మెజార్టీ ఎంపీటీసీ, సర్పంచ్ సీట్లు గెలుపొందేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి, ఎన్నికల్లో గెలవడానికి తీసుకోవాల్సిన కార్యాచరణ, సలహాలు, సూచనలు సమావేశంలో పేర్కొన్నారు.




బస్తీదవాఖానా వద్ద గుంతలమయమైన రోడ్డు

గడ్డిఅన్నారం బస్తీ.. సమస్యలతో సుస్తీ

- ధ్వంసమైన రోడ్లు, పొంగుతున్న డ్రైనేజీలు
- పేరుకుపోతున్న వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారం బస్తీవాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో సమస్యలు తాండవం చేస్తున్నాయి. అస్తవ్యస్తంగా పారిశుధ్య వ్యవస్థ, పాడైన మ్యాన్‌హోళ్లు, ఛిద్రమైన రోడ్లు, పేరుకుపోయిన వ్యర్థాలు, మట్టికుప్పలతో అవస్థలు పడుతున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులతో మొరపెట్టుకున్నా స్పందించే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు.

కంకర తేలిన రోడ్లు..

గడ్డిఅన్నారంలో రోడ్లు ధ్వంసమై కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. అభివృద్ధి పనుల కోసం తవ్విన రోడ్లు అసంపూర్తిగా వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అసలే ఇరుకైన దారులు.. రోడ్లు మరమ్మతుకు నోచుకోక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ హాస్టళ్లు, విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు అధికంగా ఉండటంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. వాహనాల రాకపోకల ధాటికి రోడ్లన్నీ పాడైపోతున్నాయి. పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించడానికి తిప్పలు పడుతున్నారు. మరమ్మతుకు నోచకోక మ్యాన్‌హోళ్ల మూతలు పైకితేలి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. గంగా థియేటర్ రోడ్ నుంచి పాత శివాలయం వరకు ప్రభుత్వ పాఠశాల నుంచి బస్తీ దవాఖానా వరకు గడ్డిఅన్నారం బస్తీలోని రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని వాటి స్థానంలో నూతనంగా నిర్మించాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

అధికారులు పర్యవేక్షణ కొరవడి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గడ్డిఅన్నారం బస్తీ దవాఖానా ప్రహరీ చుట్టూ చెత్తా చెదారం, మట్టికుప్పలు పేరుకుపోయాయి. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉంది. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. వ్యర్థాల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టినా బస్తీలు, కాలనీల్లో ఎక్కడ చూసినా మట్టికుప్పలు, వ్యర్థాలే కన్పిస్తున్నాయి. లక్షల్లో నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో నిత్యం మురుగు ఏరులై పారుతుంటుంది. ఆ ప్రాంతంలో ప్రైవేట్ హాస్టళ్లు ఎక్కువగా ఉండటంతో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వద్ద జామ్ అవుతోంది. దీంతో డ్రైనేజీ సమస్య జటిలంగా మారి స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.


ప్రభుత్వ పాఠశాల ఎదురుగా పేరుకుపోయిన వ్యర్థాలు

అధికారులు స్పందించాలి..



పాడైన రోడ్లు, మ్యాన్‌హోళ్లు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. అభివృద్ధి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకోవాలి.

– సంగేపాక ధర్మేందర్, గడ్డిఅన్నారం బస్తీ

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన

హస్తినాపురం: డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం కార్పొరేటర్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

సివిల్ సప్లై వాహనంపై దాడి

- కేసు నమోదు

చంచల్‌గూడ: రేషన్ సరుకులు సరఫరా చేసి వస్తున్న సివిల్ సప్లై వాహనంపై దాడి చేసిన వ్యక్తిపై మాదన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నవంబర్‌లో షేక్ ఫయాజ్(30) ఎల్‌బీ నగర్ నుంచి డీసీఎంలో రేషన్ సరుకులు తీసుకువచ్చి యాకత్‌పురాలోని రేషన్ షాపుల్లో సరఫరా చేసాడు. తిరిగి ఎల్‌బీనగర్‌కు వెళ్తుండగా మాదన్నపేటలోని హర్మేన్ హోటల్ వద్ద మద్యం మత్తులో ఉన్న అజీజ్ వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను దూషిస్తూ డీసీఎం అద్దాలు ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు పోలీసులు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాదంలో చైతన్యపురి వాసికి గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ నవీన్‌కుమార్

చైతన్యపురి: కుంభమేళా నుంచి తిరిగి వస్తున్న క్రమంలో మధ్యప్రదేశ్ జబల్‌పూర్ సిహోరా సమీపంలో రోడ్డు ప్రమాదంలో చైతన్యపురి న్యూమారుతీనగర్ కాలనీకి చెందిన సుంకోజు నవీన్‌కుమార్ గాయపడ్డాడు. గౌలిపురలో గోల్డ్ వర్క్ షాప్ నిర్వహించే నవీన్‌కుమార్ శనివారం బంధువులు, స్నేహితులతో కలిసి వెళ్లారు. మంగళవారం ఉదయం బయలుదేరి నగరానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. 9 మంది కలిసి వెళ్లగా వీరిలో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా కాలు విరిగిన నవీన్‌కుమార్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుటుంబ సభ్యులు, అక్కడి పోలీసులు సమాచారం ఇచ్చారు.

ఇసుక లారీలపై దాడులు ఆపాలి

మన్సూరాబాద్: రాష్ట్రంలో ఇసుక లారీలు, యజమానులపై అధికారులు దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని, ఇసుక లారీలపై దాడులను ఆపాలని రాష్ట్ర ఇసుక లారీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మన్సూరాబాద్‌లోని ఎస్కే గార్డెన్స్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ సంఘాల జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అధిక లోడ్ పేరుతో ఆర్టీఏ, మైనింగ్, విజిలెన్స్ అధికారులు ఇసుక లారీలపై రూ.లక్షల్లో చలాన్లు విధిస్తున్నారన్నారు. చలాన్లు చెల్లించలేక ఎంతోమంది యజమానులు ఆత్మహత్యలకు పాల్పడటంతో ఎంతో మంది డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. ఇసుక క్వారీల్లోని కాంట్రాక్టర్లు తమ స్వార్థం కోసం ఇసుక లారీల్లో అధిక లోడ్‌ను నింపుతుండటంతో యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు విచారణ చేపట్టి ఇసుక క్వారీల్లోని కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో వెంకన్న, యాదయ్యగౌడ్, సలీం, జంగయ్య, జగదీష్‌యాదవ్, అంజయ్య, లింగయ్య, జంగయ్య, పందుల జంగయ్య, జాజుల నర్సింహా, కందుల నర్సింహా, ఆకుల శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నర్రి వెంకన్న

అనధికార శ్మశానవాటికలను తరలించాలి


మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసిన కాలనీవాసులు

మన్సూరాబాద్: కాలనీల్లోని శ్మశానవాటికలను వేరే ప్రాంతానికి తరలించాలని నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. కాలనీలోని అనధికార శ్మశానవాటికలు, వివాదస్పద పార్కులతో పాటు దెబ్బతిన్న రోడ్ల గురించి రాంరెడ్డికి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగవల్లి జైపాల్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం పేర్కొన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కూడలిలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు చేస్తున్న సేవకు కాంగ్రెస్ ప్రభుత్వంలో కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. గత పాలకులు కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. ప్రజల సహకారంతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎప్పటికి ప్రజల పక్షపాతిగానే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్, శికుమార్, శివరాజ్, మహేష్, నరసింహా, శరణ్‌జిత్ సింగ్, యాదగిరి, రాజశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

సమస్యల పరిష్కారానికి చర్యలు

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని వనస్థలిపురం తూర్పు కాలనీల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైకోర్టు కాలనీలో వనస్థలిపురం ఈస్టర్న్ కాలనీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విజయవాడ జాతీయ రహదారిపై జరుగుతున్న విస్తరణ పనులతో కాలనీలకు వెళ్లే వారికి యూ టర్న్ సమస్యలు వస్తున్నాయని, పలుచోట్ల రోడ్డు దాటడం ప్రమాదకరంగా మారిందన్నారు. కమలానగర్‌లో వర్షాకాలంలో వరద సమస్యలు, బీడీఎల్ కాలనీలో సీసీ రోడ్ల రిస్టోరేషన్, శారదానగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

మీసేవ.. గోలగోల

రేషన్ కార్డుల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం చెప్పడంతో మలక్‌పేటలోని మీ సేవ కేంద్రం కిక్కిరిసింది. ఒక్క దరఖాస్తు ఎంట్రీ చేయాలంటే 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతుందని మీ సేవ ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి తెలిపారు. భారీగా జనం తరలిరావడంతో దరఖాస్తులు అందించే క్రమంలో గొడవలు సైతం జరిగాయి. –చాదర్‌ఘాట్



బుక్ చేసిన రోజే నీటి ట్యాంకర్

చాదర్‌ఘాట్: మార్చి మొదటి వారం నుంచి ఎండలు తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో బుక్‌చేసిన రోజే నీటి ట్యాంకర్‌ను పంపిస్తామని మలక్‌పేట సర్కిల్–1 డిప్యూటీ జనరల్ మేనేజర్ హస్మత్ అలీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ఏ ఏ ప్రాంతాల్లో నీటి కొరత ఉందో సర్వే చేయించామని రిజర్వాయర్ల పరిధిలో సెక్షన్ మేనేజర్లను అప్రమత్తం చేశామన్నారు. నీటి ట్యాంకర్లు కావాల్సిన వారు 155313 నంబర్‌ను సంప్రదించాలన్నారు.


హస్మత్ అలీ

నేడు జైళ్ల శాఖ స్పోర్ట్స్ మీట్

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ 7వ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనుంది. బుధవారం ఉ.8.30 గంటలకు చంచల్‌గూడలోని సీకా మైదానంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా ఈ మీట్‌ను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

రేపు సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

లింగోజిగూడ: రంగారెడ్డి జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపికను ఈ నెల 13న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంపిక ఉంటుందని 16 ఏళ్లలోపు బాలబాలికలు తమ ఆధార్ కార్డుతో ఎంపికకు హాజరవ్వాలన్నారు. 55 కిలోల లోపు ఉండాలని ఎంపికైన వారు ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో జరిగే 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా పోటీల్లో రంగారెడ్డి జిల్లా తరఫున ఆడుతారన్నారు. పూర్తి వివరాలకు 7661992581, 9000038272 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్పొరేటర్‌కు సన్మానం


పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

లింగోజిగూడ: జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్‌గా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌ను మంగళవారం పలు కాలనీలవాసులు, నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవా చేసే అవకాశం అందరికి రాదని నాకు రావడం ఎంతో అదృష్టంగా భావిస్తూ డివిజన్‌ను అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు.

గణితంలో సత్తా



చంపాపేట: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మంగళవారం రామానుజన్ ప్రతిశాలి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయిగణిత పోటీలలో చంపాపేట భాష్యం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు పాఠశాల హెచ్‌ఎం ప్రీతా సునీల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చైతన్య, జోనల్ ఇన్‌చార్జి అంకారావు, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పహాడీషరీఫ్: ఎర్రకుంట విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు బస్తీలలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎల్.వీ.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్రకుంట, ఎస్.జే.గార్డెన్, ఝుంఝుం కాలనీ, బారా మజ్లీస్, ఒవైజ్ కాలనీ, షోయబ్ కాలనీ, న్యూ మహ్మద్‌నగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉండడాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కరాటేతో స్వీయ రక్షణ

పహాడీషరీఫ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బీఆర్‌ఎస్ నాయకుడు సయ్యద్ ఫెరోజ్ అన్నారు. సయ్యద్ రఫీక్ స్మారకార్థం వెంకటాపూర్‌లో మంగళవారం కరాటే పోటీలు నిర్వహించారు. టైగర్ షోటోకాన్ కరాటే అకాడమీ నిర్వాహకుడు జాఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో జరిగిన మూడో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన జీనత్ బేగం, ఫర్హీన్‌బేగం, శైకా మరియం, ఆజంను అభినందించారు. స్వీయ రక్షణకు యుద్ధ విద్యలు ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో యువకుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో యువకుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీలు సునితా బర్ల, రఘు వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో నివసించే ఆటో డ్రైవర్ అదే ప్రాంతంలో నివసించే 8 ఏళ్ల మైనర్ బాలిక తన ఇంటి ముందు ఆడుకుంటుండగా అపహరించాడు. 2013 నవంబర్ 4న రోజులాగా ఆడుకోవడానికి బయటకి వెళ్లిన తన కూతురు ఎంత సేపటికి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా ఏడుస్తూ కనిపించింది. తాను ఆడుకుంటుండగా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లుగా బాలిక తల్లికి చెప్పింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సాక్షులను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి. నిందితుడికి జీవిత ఖైదు, బాలికకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేశారు.